పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

- పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభం
- విశాఖ తూర్పు రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్
- కౌంటింగ్ నిర్వహణపై అవగాహన


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని విశాఖ తూర్పు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశాఖ తూర్పు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, వివిధ బృందాలు ఏర్పాటు చేయవలసిన విధులకు సంబంధించి అధికారులకు అవగాహన కల్పించి, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. వచ్చేనెల 4న ఉదయం 8 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందన్నారు. 8వ నంబర్ గదిలో అసెంబ్లీ, 9వ నంబర్ గదిలో పోస్టల్ బ్యాలెట్, 10వ నంబర్ గదిలో పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు.

- అసెంబ్లీ కౌంటింగ్ హాల్‌లో 14 కౌంటింగ్ టేబుల్స్, పార్లమెంట్ హాల్‌లో 14 టేబుల్స్ లెక్కింపు కోసం ఏర్పాటు చేశామని జేసీ తెలిపారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్లను హమాలీలు తీసుకుని వస్తారని, వారికి డ్రెస్ కోడ్ ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూములు పోటీ అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో తెరవాలని స్పష్టం చేశారు.

- ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్ చేసి కౌంటింగ్ చేయాలన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సీతో నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని, తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్‌ను రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. కంట్రోల్ యూనిట్‌లో క్లాక్ ఎర్రర్ వస్తే కొత్త బ్యాటరీ వేసి ఆన్ చేయాలని, అప్పటికి క్లాక్ ఎర్రర్ వస్తే రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని చెప్పారు. కంట్రోల్ యూనిట్‌లో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలన్నారు. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సీలో నమోదైన ఓట్లను ట్యాలీ చేసుకొని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని సూచించారు. 14 టేబుల్స్ వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత, ఆ రౌండ్ వివరాలు రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలని ఆయన తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయక రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు, ట్యాబ్యులేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గందరగోళానికి గురికావొద్దు

కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వీవీ ప్యాట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని జేసీ ఆదేశించారు. ఎటువంటి సందర్భం ఎదురైనప్పటికీ లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దన్నారు. అధికారులు కౌంటింగ్ ప్రక్రియలో ఓటు నమోదు వివరాలకు సంబంధించి గోప్యత పాటించాలని సూచించారు. వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపు అప్రమత్తంగా చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆ స్లిప్పులను బ్లాక్ కవర్లలో భద్రపర్చి సీల్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తం వీడియో తీయాలన్నారు. కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులను అనుమతించవద్దని ప్రతి ఒక్కరూ ఐడీ కార్డు ధరించాలన్నారు. పోటీ అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ హాల్ వద్దకు సకాలంలోకి చేరుకోవాలని తెలిపారు. ఆర్వో అనుమతి లేకుండా ఏ ఒక్కరూ బయటకు వెళ్లకూడదన్నారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద తనిఖీ చేసిన తరువాతే లోపలికి అనుమతిస్తామని చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం


సమావేశంలో మాట్లాడుతున్న చిన్మయిదేవి

ఎంవీపీ కాలనీ: జిల్లా స్థాయి రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ఏటా మే 28న నిర్వహిస్తుందన్నారు. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. ఆ సమయంలో మహిళల్లోని అపోహలు, అభద్రత భావాన్ని తొలగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అంశంపై బాలికల్లో అవగాహన పెంచేందుకు పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరగాలన్నారు. రుతుక్రమ సమయంలో పరిశ్రుత పాటించకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో బాలికలు, మహిళలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు


మద్దిలపాలెం కూడలి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ కనకరాజు

మద్దిలపాలెం : నగర ట్రాఫిక్ పోలీసు విభాగం ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. మద్దిలపాలెం సిగ్నల్ కూడలి వద్ద మంగళవారం ట్రాఫిక్ ఎస్‌ఐ కె.కనకరాజు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఇసుకతోట నుంచి నగరంలోకి వస్తున్న వాహనాలతో పాటు, ఇటు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఇసుకతోట వైపు వెళ్లే ద్విచక్ర, ఆటో డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సుధామాధురికి ఏయూ డాక్టరేట్


ఉత్తర్వులు స్వీకరిస్తున్న సుధా మాధురి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని ఈద సుధా మాధురికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఆచార్య టి.షారోన్ రాజు పర్యవేక్షణలో 'విశాఖపట్నం జిల్లాలో మాధ్యమిక పాఠశాల విద్యార్థుల్లో జీవశాస్త్ర అభ్యసన ఆసక్తులు.. వారు సాధించిన విజయాలు'అనే అంశంపై జరిపిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ సాధించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుండి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు.

హారన్ల మోతపై కఠిన చర్యలు


శబ్ద కాలుష్యంలో నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: తీవ్రమైన శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుని, హారన్లు మోగిస్తూ తిరుగుతున్న బుల్లెట్ వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని ప్రయాణిస్తున్న ముగ్గురు ద్విచక్ర వాహనచోదకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కె.కనకరాజు మాట్లాడుతూ వాహన చోదకులు శబ్ద కాలుష్యంతో కూడిన వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్‌ను వినియోగించడం తగదన్నారు.

డిగ్రీ ఫలితాల్లో బీవీకే విద్యార్థుల సత్తా


ర్యాంకర్లను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సీతంపేట : స్థానిక బీవీకే కళాశాల విద్యార్థినులు ఇటీవల విడుదలైన డిగ్రీ ఫలితాల్లో ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. బీకాంలో సుంకరి సోమలిక మొదటి ర్యాంకు, బీఏలో కొనేయ దేదీప్య రెండవ ర్యాంకు, బి. రిషితనాయుడు మూడవ ర్యాంకు సాధించి టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ పట్టాభి రామారావు, డైరెక్టర్ అంజలి ప్రసాద్, కోశాధికారి వై.శ్రీధర్, పరిపాలన అధికారి కె.ఏ.వి.కృష్ణమాచార్యులు, ప్రిన్సిపాల్ టి.గోవిందరావు అభినందించారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ




మైదానం చుట్టూ ఏపుగా పెరిగిన మొక్కలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సిబ్బంది నాటిన మొక్కలను కంటికిరెప్పలా కాపాడుతున్నారు. ఏయూ మైదానం చుట్టూ గతంలో నాటిన మొక్కలను సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. క్రమం తప్పకుండా మొక్కలకు నీరు పోస్తున్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానం చుట్టూ నాటిన మొక్కలకు కంచె ఏర్పాటు చేసి, అవసరమైన నీటిని ట్యాంకర్‌తో సరఫరా చేస్తూ కాపాడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ నాటిన పలు మొక్కలు ఏపుగా పెరిగి పచ్చగా దర్శనమిస్తున్నాయి. కొన్ని మొక్కలను మాత్రం పశువులు తినేస్తున్నాయి. ఇక్కడ నాటిన మొక్కల్లో దాదాపుగా అన్ని ఏపుగా ఎదిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి.


మొక్కలకు నీరు పోస్తున్న ఏయూ సిబ్బంది

సామాజిక సంక్షేమానికి కృషి

బీచ్ రోడ్డు: సామాజిక సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ మనీష్ తివారీ అన్నారు. సీఎస్ఆర్ కార్యక్రమ వివరాలను మంగళవారం ఆయన మీడియాకు వివరించారు. తమ సంస్థ విద్య, ఆహార భద్రత, సస్టైనబిలిటీ, మహిళా సాధికారతపై దృష్టి సారించిందన్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఉద్యోగ కల్పన కోసం శానిటరీ నాప్‌కిన్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్లోబల్ రిసోర్స్ సెంటర్ ద్వారా 10 వేలు మంది శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించామన్నారు.

అక్రమ లేఅవుట్లను అరికట్టాలి

బీచ్ రోడ్డు: వి.మాడుగుల మండలం సాగరం గ్రామం పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు జోరుగా సాగుతున్నాయని, వాటిని తక్షణమే అరికట్టాలని ఆ పంచాయతీ రైతులు ఎం.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు వీఎంఆర్‌డీఏ అధికారులను కోరారు. ఈ మేరకు సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. వీఎంఆర్‌డీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సుమారు 14 ఎకరాల పంట పొలాల్లో అక్రమ లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వాటిని తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ పరీక్షలకు 30 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 30 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం జువాలజీ, మ్యాథ్స్-2, హిస్టరీ పరీక్షలకు 386 మంది హాజరు కావాల్సి ఉండగా.. 16 మంది గైర్హాజరయ్యారన్నారు. వారిలో జువాలజీ పరీక్షకు 3, మ్యాథ్స్‌కు 12 మంది, హిస్టరీ పరీక్షకు ఒకరు హాజరు కాలేదని ఆయన తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలో 578 మందికి 564 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. వీరిలో జువాలజీ పరీక్షకు ముగ్గురు, మ్యాథ్స్‌కు 11 మంది గైర్హాజరయ్యారన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జితసేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

కుటుంబ వ్యవస్థకు రామాయణమే మూలం


మాట్లాడుతున్న రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట : భారతీయ కుటుంబ వ్యవస్థ.. రామాయణం అనే అంశంపై మంగళవారం ప్రసంగ కార్యక్రమం జరిగింది. భారతీయ శిక్షణ్ మండల్ నిర్వహణలో స్థానిక బీవీకే కళాశాలలో చెరుకూరి సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రధాన వక్తగా మాట్లాడారు. మన కుటుంబ వ్యవస్థ సమాజానికి బలమైన ప్రాకారమని, ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి వ్యవస్థ లేదని తెలిపారు. కాలక్రమంలో ఇక్కడ కూడా అనుబంధాలు పతనమవుతున్నాయన్నారు. రామాయణం ప్రాచీన కుటుంబ వ్యవస్థకు మూలమని తెలిపారు. రామాయణంలోని అన్నదమ్ముల అనుబంధం సమాజానికి ఆదర్శమని, అయోధ్య, లంక, కిష్కింధల్లో భిన్న సంస్కృతులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కొత్తూరు రమణ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు దివాకర్

మర్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆటోలో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులందించిన వివరాలిలా.. రామ్మూర్తిపంతులుపేట (ఆర్పీపేట) పవర్ స్టేషన్ పక్కన ఉన్న పార్కు వద్ద ఆటోలో మంగళవారం బోర దివాకర్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సదరు మృతుడు కొంతకాలంగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. అలాగే తల్లి దగ్గర కొంతకాలం ఉన్నాడు. తర్వాత విభేదాలు రావడంతో వారికి కూడా దూరంగా ఉంటూ బయట గడుపుతున్నాడు. ఇతడికి మద్యం సేవించే అలవాటు ఉంది. మద్యం ఎక్కువ సేవించడం వల్ల మృతి చెందాడా, ఆహారం లేక మరణించాడా, మరే ఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగుల పాఠశాలలో ఎన్టీఆర్ జయంతి

ఎంవీపీ కాలనీ: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి వేడుకను మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-12 లాసన్స్ బే కాలనీ దరి హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల స్కూల్‌లో నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి పోతన్న రెడ్డి, బుగత సత్యనారాయణ, స్కూల్ నిర్వాహకుడు కండిపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సౌరభం

- చక్కటి సేవలందిస్తున్న దొండపర్తిలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం
- పాఠకులకు అందుబాటులో 80 వేల పుస్తకాలు
- పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రాధాన్యం


గ్రంథాలయంలో పాఠకులు

సీతమ్మధార: దొండపర్తిలో ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం సాహితీ సౌరభాలు వెదజల్లుతోంది. 1966లో ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఇక్కడ దాదాపు 80 వేల వరకు వివిధ రకాల పుస్తకాలున్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడే అనేక పుస్తకాలను ఇక్కడ పొందుపరిచారు. అలాగే పాఠకులు ఇష్టపడే నవలలు, పిల్లలకు నచ్చే కామిక్స్, రంగురంగుల కథల పుస్తకాలు ఇక్కడున్నాయి. అలాగే రాజకీయ శాస్త్రం, ఇంజినీరింగ్, న్యాయశాస్త్రం, పలువురు ప్రముఖుల జీవిత చరిత్రలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు, హిందీ చదువరుల కోసం పలు రకాల గ్రంథాలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. ఈ గ్రంథాలయం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుంది. రోజూ ఇక్కడికి వందకు పైగా విద్యార్థులు, పాఠకులు వస్తుంటారు. గ్రంథాలయ కర్తలు పైడిరాజు, వీఏ పద్మావతిదేవి పర్యవేక్షణలో సిబ్బంది ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ప్రతి గురువారం, రెండో శనివారం సెలవుదినంగా పాటిస్తున్నారు. ఈ గ్రంథాలయంలో ఏడు వేల మంది సభ్యత్వం కలిగి వున్నారు.

వేసవి శిక్షణ శిబిరం..

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు ఇక్కడ రోజూ ఉదయం పూట స్పోకెన్ ఇంగ్లిష్, కథా పఠనం, పాటల వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. జూన్ 7వ తేదీన జరిగే ముగింపు ఉత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పాండిచ్చేరి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన విజయలక్ష్మి ఈ గ్రంథాలయానికి 160 పుస్తకాలు విరాళంగా అందజేశారు. జేడీ ఫౌండేషన్ యాజమాన్యం మూడు టేబుళ్లు, 20 కుర్చీలు, మూడు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్ లైట్లు విరాళంగా అందించారు. ఇక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన దాదాపు 30 మంది యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ ఏటా నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.



నెహ్రూబజార్‌లోని ప్రాంతీయ గ్రంథాలయం


ర్యాకుల్లో అందంగా అమర్చి ఉన్న పుస్తకాలు

అందుబాటులో 80 వేల పుస్తకాలు



ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో 80 వేల వరకు పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలు, జనరల్ నాలెడ్జి బుక్స్ విద్యార్థుల కోసం ఇక్కడ పొందుపరిచాం. ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు చదువుకుని ఎంతో మంది ఉద్యోగాలు సంపాదించారు. గ్రంథాలయ సేవలను పాఠకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–వీఏ పద్మావతిదేవి, లైబ్రేరియన్,

ఏవీఎన్‌లో జాబ్ అచీవర్స్ డే



మాట్లాడుతున్న అతిథి

అల్లిపురం: మిసెస్ ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరానికి సంబంధించి వివిధ కంపెనీల ద్వారా ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సీఎంఈ, సివిల్ విభాగానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ బానోజీరావు, గౌరవ అతిథులుగా జోన్-4, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీహెచ్ సంతోషకుమారి, ఏయూ ఫిజిక్స్ విభాగం హెచ్‌వోడీ ఆచార్య వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రెనింగ్ , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.వెంకటేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.